ప్రజాశక్తి
ఆదివారం 2 జూలై 2023
5
శ్రీకాకుళం



జీడి మద్దతు ధరపై మంత్రి మౌనం వీడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - పలాస

జీడిపిక్కలకు మద్దతు ధరపై స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు మౌనం వీడి ఎందుకు మాట్లాడడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీడి రైతులు మద్దతు ధర లేక తీవ్ర దోపిడీ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతుల పక్షాన ఉంటుందా? దళారుల పక్షాన ఉంటుందా? అని ప్రశ్నించారు. రైతులకు రెట్టింపు ఆదాయాన్ని చేస్తామన్న బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం జీడి రైతుల మద్దతు ధరపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ రైతుభరోసా కేంద్రాల ద్వారానే జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నా, జీడిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడి యాజమాన్యాలు పరిశ్రమల బంద్ పేరుతో ఇటు రైతాంగాన్ని, అటు కార్మికులను తీవ్రంగా దోపిడీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జీడిపప్పుకి ఏటా ధర పెరుగుతుంటే, జీడిపిక్కలకు మాత్రం ధర తగ్గుతోందన్నారు. దీనివల్ల ఇటు రైతాంగం, అటు వినియోగదారులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. జీడి రైతుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జీడి రైతుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు జీడి రైతులతో కలిసి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు కృష్ణారావు, జె.భాగ్యలక్ష్మి, ఎన్.ఢిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏదీ సన్నద్ధత..?

- ప్రతిపాదనల దశలోనే గుర్రపుడెక్క తొలగింపు
- టెండర్ల దశలోనే జంగిల్ క్లియరెన్స్ పనులు
- శిథిలావస్థలో షట్టర్లు
- 8వ తేదీన వంశధార నీరు విడుదల

కాలువల్లో ఒకవైపు భారీగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. మరోపక్క జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలు కాలేదు. గట్లను పటిష్టం చేసే పనులూ ప్రారంభించలేదు. ఇంతలోనే వంశధార నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వచ్చే నెల ఎనిమిదో తేదీన కాలువల్లోకి నీటిని విడిచిపెట్టేందుకు ముహూర్తం ఖరారు చేశారు. వర్షాలు లేకపోవడంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు కూడా పెద్దగా లేవు. కాలువలపై ఏర్పాటు చేసిన షట్టర్లూ శిథిలావస్థలో ఉన్నాయి. లష్కర్ల నియమకాలు పూర్తికాకపోవడంతో కాలువకు ఇరువైపులా భూములకు నీటిని విడిచిపెట్టడం సమస్యగా ఉంది. ఇన్ని సమస్యల మధ్య నీరు విడిచిపెట్టనుండడంతో ఎంతమేర భూములకు నీరందుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. గతేడాది జులైలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు వంశధార కాలువ మట్టి నానిపోవడంతో గొట్టా బ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకలమెట్ల సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. ఈ అనుభవాల నేపథ్యంలో ఈ ఏడాది నీటి ప్రవాహాన్ని కాలువ గట్లు ఎంతవరకు తట్టుకుంటాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలోని కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ప్రతిపాదనల దశలోనే గుర్రపుడెక్క తొలగింపు

పంట కాలువల్లో ఈ ఏడాది పూడికతీత పనులు చేపట్టకపోవడంతో, శివారు భూములకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. పంట కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోయింది. గతేడాదీ పనులు చేపట్టకపోవడంతో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. నీటిని విడిచిపెట్టే సమయానికే గుర్రపుడెక్క తొలగించాల్సి ఉండగా, అందుకు సంబంధించిన పనులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. వంశధార ఎడమ, కుడి కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపునకు సుమారు రూ.90 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనులూ పెండింగే

నీటి తీరువా నిధులతో చేపట్టే కేటగిరీ-ఎ పనులూ పెండింగ్‌లో ఉన్నాయి. వంశధార ఎడమ కాలువకు సంబంధించి జంగిల్ క్లియరెన్స్, గట్లను పటిష్టపరచడం వంటి పనులు ఇప్పటివరకు మొదలు కాలేదు. టెక్కలి డివిజన్‌లో 30 పనులకు రూ.1.61 కోట్లు, నరసన్నపేట డివిజన్‌లో 29 పనులకు రూ.69 లక్షలు కేటాయించారు. పనుల కోసం టెండర్లను పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండోసారి టెండర్లను పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల కిందట చేపట్టిన పనులకు రూ.4.16 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది.

వేధిస్తున్న లష్కర్ల కొరత

సాగునీటి రంగంలో క్షేత్రస్థాయిలో కీలకమైన లష్కర్ల కొరత వేధించడం మరో సమస్యగా ఉంది. జలవనరులశాఖలో 230 మంది లష్కర్లు, మ్యాన్ మజ్దూర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 50 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 1978-80 మధ్య కాలంలో లష్కర్లు, మ్యాన్ మజ్దూర్ నియమకాలు చేపట్టారు తప్ప ఆ తర్వాత భర్తీ చేయలేదని అధికారులు చెప్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత చాలా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా 98 పోస్టులను మంజూరు చేసినా, వాటి భర్తీ ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. లష్కర్లు లేకపోవడంతో నీటిని నియంత్రించే అవకాశం లేకుండా పోయింది

శిథిలావస్థలో షట్టర్లు

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. 2009లో సిఐడి నమోదు చేసిన కేసుపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. వంశధార అధికారులు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఈ ఏడాదీ కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి తలెత్తింది. శిథిలావస్థలో ఉన్న షట్టర్లతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది.

దోమల నివారణతోనే డెంగీ దూరం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డెంగీ నివారణకు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఆరోగ్య, మున్సిపల్, సచివాలయ సిబ్బందితో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి డిఎంహెచ్ఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ జ్వరం వస్తుందన్నారు. దోమ కాటు ద్వారా ఇతర వ్యక్తులకు వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు నివారించడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని కోరారు.

జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ డెంగీని వ్యాపింపజేసే దోమలు పగలు, రాత్రీ తేడా లేకుండా కుడతాయని తెలిపారు. ఈ రకమైన దోమలు చికెన్‌గున్యా వైరస్‌నూ వ్యాప్తి చేస్తాయని చెప్పారు. దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం, కలెక్టర్లు తదితరులు

రూ.12 కోట్లతో 'ఓనిగడ్డ' ఆధునికీకరణ

ప్రజాశక్తి - బూర్జ

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని బూర్జ, పాలకొండ ప్రాంతాల్లో ఓనిగడ్డ రిజర్వాయర్, కాలువ ఆధునికీకరణ పనులు రూ.12 కోట్లతో చేపట్టనున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పాలకొండ మండలంలోని వెలగవాడ వద్ద ఓనిగడ్డ హెడ్‌ను పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు శ్రీకేష్ లాఠకర్, నిశాంత్ కుమార్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమైన సాగునీటి వనరుల్లో ఓనిగడ్డ రిజర్వాయర్ దశాబ్దాల కాలంగా రైతులకు వరప్రదాయినిగా నిలుస్తోందన్నారు. 0.3 టిఎంసిల సామర్థ్యం గల నీటిని ఈ రిజర్వాయర్‌లో నిల్వ చేసుకునే అవకాశం ఉండేదన్నారు. పాలకొండ మండలంలో రెండు వేల ఎకరాలు, బూర్జ మండలంలో ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని తెలిపారు.

సుమారు 28 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఓనిగడ్డ కాలువ పరిస్థితి దారుణంగా ఉందని, దీంతో సాగునీరందే పరిస్థితి ఉండడం లేదన్నారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లగా, రిజర్వాయర్‌లో మేట వేసిన ప్రాంతం నుంచి మట్టిని తొలగించేందుకు, కొత్త షట్టర్ల ఏర్పాటుకు, జంగిల్స్ తొలగించి ఆధునికీకరించేందుకు రూ.12 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించారని తెలిపారు. నెలాఖరులోగా పనులు ప్రారంభించి బూర్జ మండలంలోని సింగన్నపాలెం చెరువు వరకు 28 కిలోమీటర్ల పొడవునా ఖరీఫ్ సీజన్‌కు ముందే పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నీటిపారుదల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్, జెడ్‌పిటిసి బి.రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కె.గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, నీటిపారుదల శాఖ డిఇ టి.మురళి, ఎఇ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'కొరటాల' మార్గం అనుసరణీయం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రైతులు, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటాలు సాగించిన ప్రజాశక్తి సాహితీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ కొరటాల సత్యనారాయణ మార్గం అనుసరణీయమని ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎ.సోమశేఖర్ అన్నారు. కొరటాల వర్ధంతి సందర్భంగా శనివారం ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎడివిటి ఇన్‌ఛార్జి బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొరటాల రేపల్లె నుంచి శాసనసభ్యునిగా ఎన్నికై, సిపిఎంలో అంచెలంచెలుగా పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎదిగారని తెలిపారు. శాసనసభ్యునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రాష్ట్రంలో రైతాంగ సమస్యలను అప్పటి ప్రధాని మనోహ్మన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారని కొనియాడారు. పత్తి, మిర్చి రైతులు, చేనేత కార్మికుల సమస్యలపై పార్లమెంటులో పోరాడి రైతుల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. ప్రజాశక్తి రజతోత్సవ వేడుకల్లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పాల్గొనడం ఏ పత్రికకూ దక్కని అరుదైన గౌరవమన్నారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, విషయాలపై అధ్యయనం వంటివి కొరటాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరముందన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు, స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఆర్.ప్రకాశరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మోసాలతో నాలుగేళ్ల పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నాలుగేళ్లుగా అబద్ధాలు, మోసాలతో కూడిన పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకొచ్చాక వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని నమ్మబలికి ఉద్యోగులను మోసం చేశారన్నారు. ఉద్యోగులకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో 42శాతం ఫిట్‌మెంట్ ఇస్తే అంతకంటే మెరుగైన పిఆర్‌సి తెస్తానని చెప్పి ఉన్న జీతాల్లో కోతలు పెట్టారని విమర్శించారు. నవరత్నాల పేరుతో గతంలో ఉన్న పథకాలకు పేర్లు మార్చి సంక్షేమ రాజ్యం తెస్తున్నానని చెప్పి ఉన్న పథకాల్లో కోతలు పెట్టారని ధ్వజమెత్తారు. పలు కారణాలతో రాష్ట్రంలో ఎనిమిది లక్షల కుటుంబాలను పలు కారణాలతో తొలగించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో పథకాలు అందుకున్న లబ్ధిదారులు ఇప్పుడు పొందడం లేదన్నారు. పలు నిబంధనలతో అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల లబ్ధిదారులను కుదించారని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పుడు గ్రామాల్లో ఏముఖం పెట్టుకుని వెళ్తారని, మరో ఏడు నెలల్లో ప్రజలకు ఇంకేం చేస్తారని ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించి అసలు నిర్మాణాలే పూర్తి కాకుండా చేశారని చెప్పారు. రూ.700 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పిన తాగునీటి ప్రాజెక్టు మధ్యలో ఎందుకు నిలిచిపోయిందో ప్రజలకు చెప్పాలన్నారు. ఆమదాలవలస రోడ్డును ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఐటిడిపి జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- పథకం అందని లబ్ధిదారుడు ఉండకూడదు
- పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - ఆమదాలవలస, పలాస, వజ్రపుకొత్తూరు

అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడం కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా ప్రజల దగ్గరకే అధికారులను పంపిస్తున్నారని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గతంలో సాంకేతిక తప్పిదాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు ఇది మంచి అవకాశమన్నారు. మండల స్థాయి అధికారులు రోజూ రెండు సచివాలయాలకు వచ్చి ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆ సచివాలయాల పరిధిలో వచ్చిన ఆర్జీలను పరిష్కరిస్తారని తెలిపారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారికి వెనువెంటనే ధ్రువపత్రాలను అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్‌పిటిసి సభ్యులు బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, తహశీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కడికక్కడే సమస్యల పరిష్కారం

పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో అక్కడికక్కడే అందించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలంలోని రంగోయి, వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ ఒక టీమ్‌గా, ఎంపిడిఒ మరో టీమ్‌గా ఏర్పడి ప్రతి మండలంలో రోజుకు రెండు సచివాలయాలను కవర్ చేయనున్నట్లు చెప్పారు. సచివాలయ పరిధిలో సమస్యలున్న వారికి అక్కడికక్కడే పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష నియోజకవర్గ ప్రత్యేక అధికారి విద్యాసాగర్, ఎం.రవికృష్ణ, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, తహశీల్దార్లు ఎల్.మధుసూదనరావు, బి.అప్పలస్వామి, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, పశు సంవర్ధకశాఖ ఎడి పి.చంద్రశేఖర్, పలాస ఎంపిపి ప్రతినిధి సాయికృష్ణ, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

త్వరితగతిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం



సూచనలు చేస్తున్న కలెక్టర్

నౌపడ : మూలపేట పోర్టు నిర్వాసితులకు నౌపడలో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీకి త్వరితగతిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ స్థలాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నౌపడ-పూండీ రహదారిలోని చర్చి దగ్గర నుంచి కాలనీ నిర్మాణ ప్రాంతం వరకు అప్రోచ్ రోడ్డును 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే అధికారులు ఆర్ అండ్ ఆర్ కాలనీ స్థలాన్ని సర్వే చేసి, సరిహద్దు రాళ్లు పాతాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటి సరఫరాకు అంచనాలు రూపొందించాలని సూచించారు. అప్రోచ్ రోడ్డు పూర్తయిన వెంటనే కాలనీ నిర్మించే స్థలంలో మట్టితో ఎత్తు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, విఆర్ఒ ప్రసాద్, సర్వే, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇసిఇ టెక్ ఫెస్ట్

ఎచ్చెర్ల : స్థానిక ట్రిపుల్ ఐటి కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్ ఫెస్ట్-2023 శనివారంతో ముగిసింది. ఫెస్ట్‌లో 30 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్లలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఒఎస్‌డి ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆట ఊపందుకుంది



వేసవి వడగాడ్పులు చల్లబడ్డాయి. ఎన్నికల వడగాడ్పులు రానున్నాయి. దాంతో ముందస్తుగానే రాజకీయ ఆటలు మొదలయ్యాయి. ఆ ఆట ఊపందుకుని రసవత్తరంలో పడనుంది. ఎన్ని టీమ్‌లు ఆటల్లో పాల్గొంటాయి. ఏయే టీమ్‌ల మధ్య పోటీ ఉంటుంది. ఏవి ఏ గ్రూపుల్లో చేరుతాయన్నది ఇంకా అస్పష్టంగానే ఉన్నా, ప్రధాన పక్షాలు రాజకీయ ఆటలను మొదలుపెట్టేశాయి. ఒక పక్షమే తమ బలమేమిటో ప్రజల ముందు చూపిస్తుంది. మిగిలిన ప్రధాన పక్షాలు తమ బలమేమిటో ప్రజలకు చెప్పకుండా, ప్రజల్లో తిరిగి విశ్వాసం పొందేందుకు ప్రయత్నించకుండా ప్రతి విమర్శలకే పరిమితమవుతున్నాయి. జిల్లాలో ప్రధాన పార్టీలు రాజ క్రీడలో మంచి ఊపులో ఉన్నాయి. ఈ క్రీడలో ప్రత్యక్షంగా సర్వేలు, పరోక్షంగా ప్రజల పాత్రను గుర్తించే ప్రయత్నం జరుగుతోంది. జిల్లాలో వైసిపి క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని ఒకవైపు ప్రభుత్వపరంగా, మరోవైపు పార్టీపరంగా మిళితం చేసి జగనన్న సురక్ష రూపంలో ఎన్నికల ప్రచారంతో రాజకీయ క్రీడను ప్రారంభించింది. కేవలం సంక్షేమం మూటతోనే బటన్ నొక్కుడు కార్యక్రమంతో యుద్ధానికి సిద్ధమైంది. సచివాలయాల పరిధిలో క్లస్టర్ల రూపంలో పార్టీ శ్రేణులను కదిలించే పనిలో జిల్లా నాయకత్వం, ముఖ్యంగా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు సర్వసన్నద్ధమైపోయారు. కమిటీల రూపంలో వాలంటీర్ల పరిధిలోని గృహాలకు ప్రత్యేకంగా పరిశీలనకు నేతలు సిద్ధమయ్యారు. దండలో దారంలా ఈ ప్రచారంలో ఐ ప్యాక్ సర్వే కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. సురక్ష రూపంలో గృహ సర్వేలో ప్రభుత్వానికి సానుకూల ఎంత?, ప్రతికూలత ఎంతన్నది నిర్దిష్టంగా అంచనా వేస్తున్నట్లు తెలిసింది. గ్రామాల్లో ప్రతికూలంగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు సమాచారం. వారిని దారిలోకి తెచ్చేందుకు ఏమార్గం అన్వేషించాలన్నది పరిశీలించి అందుకు తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జిల్లాలో క్షేత్రస్థాయి వరకు పలురూపాల్లో అంతర్గత సర్వేలను నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వైనాట్ 175 లక్ష్యంలో జిల్లాలోని ఎనిమిది శాసనసభా నియోజకవర్గాల్లో ఫ్యాన్ గాలి రెపరెపలాడాలన్న లక్ష్యంలో పార్టీలో ప్రధానంగా నాలుగు నియోజకవర్గాల్లో గ్రూపుల పోరును చివరికి ఏ క్రీడతో ముగిస్తారో తెలియని సందిగ్ధత నేటికీ కొనసాగుతోంది. జిల్లాలో ఏ నియోజకవర్గ అభ్యర్థిని మార్చే పరిస్థితి ఇక లేదని పార్టీ సీనియర్లు చెప్తున్నారు. ఏమైనా మార్పు ఉంటే పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక సమయంలో మార్పు జరిగే అవకాశం లేకపోలేదని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థి విషయంలో మొదట్నుంచీ తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ పేర్లు వినిపిస్తున్నాయి. తాను పార్లమెంట్ బరిలో దిగడానికి సిద్ధంగా లేనని ధర్మాన ప్రసాదరావు, అందుకు ప్రతికూల అంశాలను అధినేత ముందు ప్రస్తావించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. పార్లమెంట్ అభ్యర్థి విషయంలో మరో చర్చ జరుగుతోంది. తాము ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిస్తే, తమ తనయులకు టిక్కెట్లు ఇవ్వాలని నేతలు కోరుతున్నట్లు తెలిసింది. పికె నిర్వహిస్తున్న సర్వేల్లో ముగ్గురు తనయులు తరతమ తేడాల్లో ముందువరుసలో లేరని తెలిసింది. తన కొడుక్కి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే, తాను ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ధర్మాన కృష్ణదాస్ చెప్తున్నారని ఆయన అనుయాయుల ద్వారా తెలిసింది. ముఖ్యమంత్రి జగన్‌కు ముందుగా ఎమ్మెల్యేలు ముఖ్యం కాబట్టి బలమైన ఎమ్మెల్యే అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపిస్తారా?, కొత్త వ్యక్తిని పరిచయం చేస్తారా? అన్నది ఆడిస్తున్న, ఆడుతున్న రాజకీయ క్రీడలో బయటపడుతుంది.

జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరో రూపంలో రాజకీయ క్రీడను రసపట్టుగా సాగించే ప్రయత్నంలో ఉంది. వైసిపి ప్రశాంత్ కిషోర్‌ను నియమించుకున్నట్లుగానే తెలుగుదేశం పార్టీ అధినేత ఏనాడో రాబిన్‌శర్మను నియమించుకున్నారు. పలు సర్వేలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రాబిన్‌శర్మ బృందం పని అభ్యర్థిని ఎంపిక చేయడం. నియోజకవర్గాల్లో ఒకటి, రెండు స్థానాల్లో ఎవరున్నారన్నది తేల్చాలని అధినేత రాబిన్‌శర్మను కోరినట్లు తెలిసింది. ఆ పని జిల్లాలో ఇప్పుడు జరుగుతున్నట్లు తెలిసింది. ఇది కాక ప్రత్యక్షంగా మరో మూడు విభాగాలు పనిచేస్తున్నట్లు తెలిసింది. ప్రజల్లో ప్రతికూలత ఎంత? సానుకూలత ఎంత? అన్నది ఒక విభాగం పనిచేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోపై ప్రజల్లో ఎలాంటి స్పందన ఉందన్నది గుర్తించే పనిలో ఒక విభాగం పనిచేస్తున్నట్లు తెలిసింది. బూత్ కమిటీల స్థాయి ప్రచారానికి ఒక విభాగం సిద్ధమైనట్లు తెలిసింది. ఆ ప్రణాళికను ఇంటింటా ప్రచారం చేయాలని అధినేత చంద్రబాబు ఇప్పటికే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోకేష్ బృందం మరో ప్రచార కార్యక్రమంలో ఉన్నట్లు తెలిసింది. గ్రామస్థాయిలో ప్రజల్లో కలిసి తిరుగుతూ పార్టీపై వారు వెల్లడిస్తున్న విశ్వాసాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రచార కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. రాజ క్రీడలో జిల్లాలో సెల్ఫ్ గోల్ చేసుకునే కార్యక్రమాలు సాగుతుండడం చూస్తున్నాం. ఈ సెల్ఫ్ గోల్స్ పార్టీలోని రాష్ట్ర ముఖ్య నేతల్లో ఒకరు ఆడిస్తున్న ఆట అని, ఆ పార్టీలోనే ప్రచారంలో ఉంది. ఇలాంటి ఆట టిడిపిలో వారసత్వంగా కొనసాగుతూ వస్తోంది. ఆ వారసత్వ నేతల్లో ఒకరు తెర పైకి రావడం చూశాం. సెల్ఫ్ గోల్ నివారణకు అధినేత ప్రత్యేకంగా పరిశీలకుల రూపంలో ఒక దూతను పంపడం, ఇరువురితోనూ చర్చించి సర్దుకుపోవాలని చెప్పడం చూశాం. చివరికి ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని మీడియాకు చెప్పే వరకు పరిస్థితి వచ్చింది. పాతపట్నంలోనూ ఇలాంటి పరిస్థితే ఉద్భవించింది. అవసరాలకు ఆర్థికంగా అండదండలు అందిస్తున్నారని గ్రూపును ప్రోత్సహిస్తుండడం చూస్తున్నాం. చివరికి ఏ స్థాయికి ప్రచారం వచ్చిందంటే, ఈసారి ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ తనయుడు పోటీ చేయనున్నారన్న ప్రచారం మొదలైంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. అక్కడ మరో గ్రూపును ప్రోత్సహించి, చిరకాల రాజకీయ శత్రువును దెబ్బతీయాలన్న ప్రయత్నం సాగుతోందన్నది ఆ పార్టీలోనే ప్రచారం ఉంది. ఈ క్రీడలో చివరి దశలో కొత్త గ్రూపు జతయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అదే జనసేన అయితే జిల్లాలో వారి ఆటను చూసేందుకు జనం సిద్ధమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అందుకు ఆ పార్టీ స్వయంకృతాపరాధమే కారణం. పార్టీ పుట్టి పదేళ్లయినా జిల్లాలో నాయకులు ఎవరో తెలియదు. ఆ విషయం అధినేతకే తెలీదు. అందుకే పార్టీ జాడ కూడా లేదు. అందువల్ల ఆ క్రీడకు సిద్ధమైతే తొలి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టక తప్పదని రాజకీయ పరిశీలనా క్రీడాకారులు చెప్తున్నారు. కొత్త గ్రూపులు, కొత్త పొత్తులు రంగంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో రాజకీయ క్రీడ కొత్త మైదానాల్లోకి మళ్లే పరిస్థితి కనిపిస్తోంది.

- సత్తారు భాస్కరరావు

'జగనన్న సురక్ష'తో ప్రజల చెంతకు సేవలు


సంతబొమ్మాళి : మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


పోలాకి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

సచివాలయ సిబ్బంది జగనన్న సురక్షతో ప్రజల చెంతకు సేవలు అందుతాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మండలంలోని బోరుభద్ర-1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి పి.వి.శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగన్ సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను అందజేస్తున్నామని అన్నారు. జిల్లాలో 732 సచివాలయాల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 1902 నంబరుకు ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంతృప్తి చెందే వరకు పరిష్కారం చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 27 వరకు నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని, వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. గోదలాంలో ఉన్న మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయాందోళనకు చెందుతున్నారని, నాడు-నేడులో భాగంగా అభివృద్ధి చేయాలని ఉప సర్పంచ్ కూస భాస్కరరావు కలెక్టర్‌ను కోరారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని చింతాడ చిన్నారావు కోరారు. టెక్కలి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించే ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిడిఒ ప్రేమలీల, తహశీల్దార్ జె.చలమయ్య, డిటి ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి జి.శ్రీలక్ష్మి, ఎంఇఒ చిన్నవాడు, హౌసింగ్ ఎఇ బి.నర్సింగరావు, ఎపిఒ వాసినాయుడు, సర్పంచ్ బుస్సల లక్ష్మీకాంతం, ఎంపిటిసి ప్రతినిధి చింతాడ చిన్నారావు పాల్గొన్నారు.

పోలాకి: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పోలాకి 1, 2 సచివాలయాల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ప్రారంభించారు. ఆయాచోట్ల పలువురు లబ్ధిదారులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్తస్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చే లక్ష్యంతో 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా చేపట్టిన కార్యక్రమం 'జగనన్నకు సురక్ష' అని అన్నారు. దీని ద్వారా వంద శాతం లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. 11 రకాల ప్రధాన ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు ఛార్జీలు వసూలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రవణమ్మ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, తహశీల్దార్ కె.శ్రీరాములు, ఎంపిడిఒ ఉషశ్రీ పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడు సచివాలయంలో జగనన్న సరక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణదాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి వాన గోపి, వైసిపి మండల సమన్వయకర్త కనుసు సీతారాం, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.రాజగోపాలరావు, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, డిటి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కవిటి 1, రాజపురం 1 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ పి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ టి రామచంద్రరావు, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రతి అర్హతగల లబ్ధిదారుడికి జగనన్న సురక్ష రక్ష వంటిదని జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. అమలపాడు సచివాలయం వద్ద సర్పంచ్ దున్నరత్నం బాలరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మట్ట రవికృష్ణ, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి దున్న బాలరాజు, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు వైఎస్ సర్పంచ్ కారాడ గిరి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిటి వి.గిరిరాజు పాల్గొన్నారు.

నందిగాం : జగనన్న సురక్షతో గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని హరిదాసుపురంలో సర్పంచ్ కణితి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిటిసి కణితి రామచంద్రుడు, ఎంపిడిఒ శివప్రసాద్, మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ, పి.వి.పురం సర్పంచ్ కొనాలి రామారావు పాల్గొన్నారు.

లావేరు : జగనన్న సురక్షతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అదపాక సచివాలయంలో జగనన్న సురక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ గొర్లె శశికళ, మాజీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, ఎంపీ ఎంపిపి డి.రాజినాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ఎంపిటిసి గంట్యాడ సత్యం పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని లింగాలవలస సచివాలయ పరిధిలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, ఎపిఒ బగాది ప్రసాదరావు, మాజీ ఎంపిపి సంపతిరావు రాఘవరావు, వైస్ సర్పంచ్ ఉమాపతి, గురుబెల్లి కమలాకర్, బగాది లోకనాథం పాల్గొన్నారు.

పొందూరు: జగనన్న సురక్షతో ప్రజల చెంతకే ప్రభుత్వం పలు సేవలను అందజేస్తుందని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు అన్నారు. మండలంలోని అచ్చిపోలవలస, బానాం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి టి.కృష్ణారావు, ఎంపిడిఒ సీపాన హరి హరరావు, తహశీల్దార్ ఎస్.రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన సూరపునాయుడు, డిటి వెంకటేష్, ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ, సర్పంచ్‌లు చంద్రమణి, రాంబాబు, పి.వి.రవిబాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని గంగరాం పంచాయతీలో ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు జగన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, డిటి ఆర్.మధు, సర్పంచ్ పేడాడ జ్యోత్న్న, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురం సచివాలయంలో డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ జగనన్న సురక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ భవానీశంకర్, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ పి.సరోజని, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, సర్పంచ్ లక్ష్మి, శేఖరాపురం సర్పంచ్ గణేష్, మండల ఎఒ దాణకర్ణుడు, ఎంఇఒ ఎస్.దేవేంద్రరరావు, కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.


లావేరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు


పొందూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న వైసిపి నాయకులు

బూర్జ : మండలంలోని డొంకలపర్త సచివాలయంలో జెడ్‌పిటిసి బి.రామారావు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వి.మురళీకృష్ణ, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రామారావు, విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, కార్యదర్శి బి.రామకృష్ణ పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని జింకిభద్ర సచివాలయంలో జగనన్న సురక్షను మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, ఎంపిడిఒ బి.వెంకటరమణ, తహశీల్దార్ సత్యనారాయణ, ఎపిఒ ప్రమీల, ఎఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద గందరగోళం


క్షతగాత్రుని బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

టెక్కలి రూరల్: వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడకు చెందిన వాండ్రాసి ధనసాయి అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన బంధువులు తీసుకు వచ్చారు. వైద్య సిబ్బంది శనివారం మధ్యాహ్నం వరకు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ క్షతగాత్రుడి బంధువులు ప్రశ్నించారు. దీంతో ఆస్పత్రిలోని గందరగోళ పరిస్థితి నెల కొంది. చికిత్స అందించకుండా తాత్సారం చేస్తు న్నారని క్షతగాత్రుని బంధువులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న టెక్కలి పోలీసులు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుని బంధువులతో మాట్లాడారు. ధనసాయి కాలు భాగం నుజ్జు అయ్యిందని, వైద్యసేవలు చేపట్టేం ముందు నిబంధనల ప్రకారం రిస్క్ సంతకాలను పెట్టాలని క్షతగాత్రుని బంధువులను కోరితే వారు వాగ్వివాదానికి దిగారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. రాత్రి ప్రథమ చికిత్స నిర్వహించామని, శనివారం ఉదయం సంబంధిత ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాజేష్ పర్యవేక్షణలో చికిత్స కొనసాగిస్తున్న క్రమంలో క్షతగాత్రుని బంధువులు గొడవ చేశారని సిబ్బంది తెలిపారు. అనంతరం క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఇదే విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా ప్రమాదంలో యువకుడి కాళ్లు తీవ్రంగా గాయపడ్డాయని, పరిశీలనకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లే క్రమంలో నిబంధనల ప్రకారం రిస్క్ సంతకం పెట్టమంటే క్షతగాత్రుని బంధువులు ఆందోళన చేపట్టారని తెలిపారు.

పిఎసిఎస్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న దశలవారీ ఉద్యమానికి పూర్తి మద్దత్తు నిస్తున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ బద్ధమైన కోర్కెల పరిష్కారానికి పిఎసిఎస్ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ఉమ్మడి పోరాటం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఈ నెల 3న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 17న చలో విజయవాడకు ఐక్య వేదిక పిలుపునిచ్చిందన్నారు. ఈ ఆందోళనా కార్యక్రమాలకు మద్దతుగా నిలబడాలని అన్ని కార్మిక సంఘాలకు, రైతు సంఘాలకు పిలుపునిచ్చారు. వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో 50 శాతం వాటాలను ప్రయివేటీకరించడాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌ల్లో విలీనం చేయడం సరికాదన్నారు. రైతుల చేతుల్లో ఉన్న సంఘాలను ప్రయివేట్ పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడాన్ని సిఐటియు ఖండిస్తోందని అన్నారు. 1964 సహకార సంఘాల చట్టానికి చేసిన సవరణలను ఉద్యోగులు కోరుతున్న విధంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 2014 ఏప్రిల్ 1 నుంచి వేతన సవరణ చేయాల్సి ఉన్నా నాటి టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 2014, 2019 వేతన సవరణలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్ ఉద్యోగుల ఇతర ఆర్థిక కోర్కెలను కూడా పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల కోర్కెలన్నీ పరిష్కారమయ్యేంత వరకూ జరిగే ఐక్య పోరాటానికి సిఐటియు మద్దతుగా నిలుస్తుందని అన్నారు.


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

కొడుకు హత్య కేసులో తండ్రి అరెస్టు

ఎచ్చెర్ల : మండలంలోని కుప్పిలిలో ఇటీవల కన్న కుమారుడినే తండ్రి హత్య చేసిన ఘటన తెలిసిందే. ఈ ఘనటకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జె.ఆర్.పురం సిఐ ఆదాం శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హతుడు కె.తాతారావును హత్య చేసిన తండ్రి కుప్పయ్యను కుప్పిలిలో నీలగిరితోటలో గత నెల 30న పట్టుకొని నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని సిఐ వివరించారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కుప్పయ్యను రిమాండ్‌కు తరలించి శ్రీకాకుళం కోర్టులో హాజరు పర్చగా, కోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లా జైలుకు తరలించామన్నారు. కుప్పయ్య తన కుటుంబ కలహాల వల్ల కుమారుడిపై కక్షకట్టి పథకం ప్రకారం తాతారావును హత్య చేశారని సిఐ వివరించారు. సమావేశంలో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

చిన్నబాడాంలో ఉద్రిక్తత


అధికారులను చుట్టిముట్టిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చినబాడాం సమీపంలో పాతజాతీయ రహదారి పక్కన చాలా ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుపై రాజకీయ కక్ష రాజుకుంది. కల్వర్టు కూల్చేందుకు అధికారులు శనివారం సిద్ధం అవుతుంటే... ఎలా కూల్చుతారని అంటు టిడిపి నాయకులు అధికారులకు నిలదీశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఘటన స్థలం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. చినబాడాంలో పాత జాతీయ రహదారి సమీపంలో అనుకొని వంశధార పిల్ల కాలువ ఉంది. ఆ కాలువ ద్వారా పంట భూములకు సాగునీరు అందుతుంది. 2014లో చినబాదాం వద్ద సర్వే నంబరు 82/5,6,7లో 172 ఎకరాల్లో 222 లే అవుట్లు వేశారు. శివారు భూములకు సాగునీరు అందించేందుకు చిన్న కల్వర్టును నిర్మించారు. ఆ కల్వర్టు సమీపంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బద్దనాగరాజు ఇల్లు నిర్మించారు. అయితే శనివారం ఉదయం వంశధార అధికారులు పిల్ల కాలువాలో పూడికలు తీసేందుకు ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టారు. కల్వర్టు వద్దకు వచ్చి భూములకు సాగునీరు అందడంలేద రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని వంశధార అధికారులు రెవెన్యూ, పోలీసుల సమాచారం అందజేశారు. తహశీల్దార్ మధుసూదన్ వచ్చి పరిశీలించారు. కల్వర్టును కూల్చివేస్తారన్న ప్రచారం జరగడంతో ఘటనాస్థలానికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష, టిడిపి నాయకులు చేరుకుని ఆందోళన చేపట్టారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

పిల్లల చదువులపై శ్రద్ధ వహించాలి

పోలాకి: తమ పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ సూచించారు. ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇస్తున్నామని, రాత్రి సమయంలో రోజూ ఇంటి దగ్గర చదివే విధంగా తల్లిదండ్రులు కూడా కొంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేకమైన దృష్టి పెట్టిందని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బొజ్జ జగన్నాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

పలాస: మండలంలోని పెదంచలలో రెంటికోట పిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు సునీల్ 90 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.రామారావు, వైస్ ఎంపిపి టి.శ్రీరాములు, కార్యదర్శి రవికుమార్, ఈశ్వరమ్మ, రోజారమణి, కామేశ్వరరావు, చిన్నారావు, రామారావు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు సన్మానం


సన్మానిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విశ్రాంత హోంగార్డుకు ఎస్‌పి జి.ఆర్.రాధిక శనివారం సన్మానించారు. జిల్లా పోలీసు హోమ్‌గార్డు యూనిట్‌లో సుదీర్ఘం కాలం పనిచేసి శనివారం విశ్రాంత తీసుకున్న ఎన్.కృష్ణమూర్తిని పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను, ప్రశంస పత్రాన్ని అందజేశారు. తక్షణ ఆర్థికసాయంగా రూ.5 వేలు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారని, సుదీర్ఘకాలం పాటు కేటాయించిన అన్ని విధులు చక్కగా నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి సాయం అవసరమైనా పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విశ్రాంత అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, ఆర్ఐలు బి.ప్రదీప్, ఉమామహేష్ పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలకు ప్రోత్సాహం

ఆమదాలవలస : మహిళా రైతు సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సహి స్తుందని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలం లోని మునగవలస, దన్నానపేట గ్రామాల్లో మహిళా రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా రైతు సంఘాలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల నుంచి పంట విక్రయం వరకు అన్ని విషయాల్లో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సొంత పొలం ఉన్న వారితో పాటు కౌలు రైతులు కూడా ఈ సంఘాల్లో సభ్యులుగా చేరవచ్చునని అన్నారు. రైతు ఉత్పత్తిదారులందరూ సేద్యం కోసం కావాల్సిన పెట్టుబడి రుణాలను ఈ సంఘాల ద్వారా బ్యాంకులు అందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పిజిల కో-ఆర్డినేటర్ రామప్పడు, విఒ ఎ.రమణమ్మ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

కోర్టు సముదాయం తనిఖీ

టెక్కలి: టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టును శ్రీకాకుళం జిల్లా 3వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోర్టు కార్యకలాపాలను నిర్వహిస్తున్న కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా టెక్కలి బార్ అసోసియేషన్ ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. టెక్కలి కోర్టు నూతన భవనాలు ప్రారంభంపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా జడ్జిని కలిసిన వారిలో జూనియర్ సివిల్ జడ్జి మల్లా చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డివ్వల వివేకానంద, సీనియర్ న్యాయవాదులు ఖజానా వెంకటరావు, డి.రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, పి.సాయిరాజ్, పొట్నూరు ఆనంద్, అంపోలు వైకుంఠరావు, పైల చంద్రుడు, దుంపల భుజంగరావు పాల్గొన్నారు.

'పోరుకేక' సంఘీభావ నిధి వసూలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తమ సమస్యలపై పోరాడుతున్న పోలవరం నిర్వాసితులకు ఆర్థిక సాయం కోసం సిఐటియు సంఘీభావ నిధి వసూలు చేపట్టింది. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు శనివారం నిధులు సేకరించారు. నిర్వాసితులకు సాయం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా జూలై ఒకటిన కార్మిక, కర్షక సంఘీభావ నిధిని వసూలు చేయాలని పిలుపులో భాగంగా నిధులను సేకరించామని చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆదినారయణమూర్తి, అల్లు సత్యనారయణ, యుబి వర్కర్స్ యూనియన్ నాయకులు ఇజ్జు నారయణరావు, జె.గంగరాజు, పి.సత్యనారయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.


లావేరు : కేక్‌ను కట్ చేస్తున్న టిడిపి నాయకులు


జి.సిగడాం : కేక్‌ను తినిపిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా 'కళా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- లావేరు

మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు జన్మదిన వేడుకలను లావేరు టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం కళ్యాణ మండపంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లంకలపల్లి శ్రీనివాసరావు, గంట్యాడ మహేష్, దారపురెడ్డి కూర్మారావు, పి.వెంకన్న, మజ్జి రామ్మూర్తి, రమేష, జగన్నదొర పాల్గొన్నారు.

జి.సిగడాం : జి.సిగడాంలో కళావెంకటరావు పుట్టిన రోజు సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కొమరాపు రవికుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పురాతన వస్తువులు స్వాధీనం


పురాతన వస్తువులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో పురాతనమైన యాసుఫ్ షా టాకియా దర్గాలో ఉన్న మహ్మద్ ప్రవక్తకి చెందిన పురాతన వస్తువులు వక్ఫ్‌బోర్డు అధికారులు, ముస్లిం పెద్దలు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని లాలపేటలో ఉన్న దర్గాలో పురాతన వస్తువులు లాకర్‌లో ఉండడంతో అసలు ఉన్నాయా? లేవా? అని సందేహంతో నూతనంగా ఎన్నికైన యాసఫ్ షా టాకియ దర్గా కమిటీ, ముస్లిం పెద్దలు పోలీస్, అధికారులు సమక్షంలో శనివారం తనిఖీలు చేశారు. దర్గా నూతన అధ్యక్షులు ఎం.అబ్దుల్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మన్నన్, కార్యదర్శి ఇఫ్రాన్, కమిటీ సభ్యులు, వక్ఫ్‌బోర్డు అధికారులు, సాదిక్ ముస్లిం పెద్దలు సమక్షంలో లాకర్ తెరిచి అందులో ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. లాకర్‌లో పురతనమైన మహమ్మద్ ప్రవక్తకి చెందిన పాదముద్రలు, బాబా వారి కమండలం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని భద్రపరిచారు. కొత్తగా ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యాన దర్గా నిర్వహణ, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, ముస్లిముల అభివృద్ధికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడానికి కమిటీ బాధ్యతలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముస్లిముల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణ ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది, స్థానిక ముస్లిం పెద్దలు జోహర్‌ఖాన్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌కు సన్మానించారు.

ఘనంగా డాక్టర్స్ డే


చీరలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.పి.రాయ్ జయంతిని పురస్కరించుకుని నగరంలో పలు ప్రాంతాల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో శనివారం స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రకాశరావు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

వైద్య నిపుణులు డాక్టర్ తమ్మినేని వేణుగోపాల్‌ను విశ్వవిద్యాలయం మాజీ సిండికేట్ మెంబరు జామి భీమశంకరరావు సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు డాక్టర్లు బొడ్డేపల్లి సురేష్ కుమార్, దానేటి శ్రీధర్, గూడేన సోమేశ్వరరావు, అన్నెపు శివప్రసాద్, సీపాన దేవీప్రసాద్, కింతలి సోమేశ్వరరావు, మెట్ట సుజాత, పైడి సిందూర ఆస్పత్రి వైద్యులను సన్మానించారు. అలాగే మారుతీవాకర్స్ క్లబ్, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కొంక్యాన మురళీధర్ చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, దంత వైద్య నిపుణులు డాక్టర్ మధుకర్ విలేకర్, డాక్టర్ కమల్ విలేకర్, గైనకాలజిస్టు డాక్టర్ ఎ.పి.ప్రసాద్, జనరల్ సర్జన్ డాక్టర్ కూన మాధురీదేవి, చిన్న పిల్లల వైద్య నిపుణులు కొంచాడ రవికుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, సరోజ పాల్గొన్నారు.

పలాస: 24 గంటల పాటు సేవలందించి మనుషుల ప్రాణాలు కాపాడి పునర్జన్మ ప్రసాదించేవారు వైద్యులని పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవాని శంకర్ అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, వైద్యులు చిన్నంనాయుడు, కూర్మారావు, అశ్విని, రఘురామ్, గీతరాణి, కిరణ్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం : డాక్టర్స్ డే సందర్భంగా ఆదివారంపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌లో నగరానికి చెందిన వైద్యులు, సంఘ సేవలు బొడ్డేపల్లి సురేష్ అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్టేషనరీ, స్కూల్‌కు బీరువ పంపిణీ చేశారు.


శ్రీకాకుళం అర్బన్ : సోమేశ్వరరావును సన్మానిస్తున్న మారుతీవాకర్స్ క్లబ్ సభ్యులు


పొందూరు : కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది


సోంపేట : కృష్ణమూర్తిని సన్మానిస్తున్న వైద్యులు

కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బి.రాంబాయి, సుజాత, సరిత, లెక్చరర్ చంద్రమౌళి, కిషోర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో కింతలి, తాడివలస పిహెచ్‌సిల్లో డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైద్యాధికారులు ఎస్.మల్లేశ్వరమ్మ, పి.శివశంకర్, సాగరిక, రమేష్‌నాయుడు, సిహెచ్‌ఒ ఎన్.వాణీకుమారి, ఇఒలు పి.మోహనరావు, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

సోంపేట: డాక్టర్స్ డే సందర్భంగా ఎస్‌సిఎస్ కళ్యాణ మండలంలో డాక్టర్ ఎ.వి.రామకృష్ణ, డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సీనియర్ డాక్టర్ యారాడి కృష్ణమూర్తిని వైద్యులు, డ్రగ్స్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాపు యజమానుల సంఘం, ల్యాబ్ అసోసియేషన్ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. డాక్టర్లు ప్రదాన శివాజీ, మూల జోగినాయుడు, పైడిశెట్టి రమేష్‌కుమార్, గోవింద్, డి.శ్రీలత, ఇ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


డయాలసిస్ బెడ్లను ప్రారంభిస్తున్న రామారావు, సాయిరాజ్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉద్దానం ప్రాంతంలోని ప్రతి ప్రభుత్వాస్పత్రిలోనూ కిడ్నీ రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నట్టు ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అదనంగా మంజూరైన రెండు డయాలసిస్ బెడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయాలసిస్ రోగులకు ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో అధికారంలో వచ్చిన వెంటనే వారికి రూ.10 వేల పింఛను అందిస్తుందని అన్నారు. ఉద్దానం ప్రాంతంలో పూర్తిస్థాయిలో కిడ్నీవ్యాధి నిర్మూలించాలనే లక్ష్యంతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ శరవేగంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ రాంజీ, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ విద్య చదువుకునేందుకు వీలుగా ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు నోటిఫికేసన్ విడుదల చేస్తున్నట్టు గురుకులాల సమన్వయకర్త బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు మందన, పాతపట్నం, తామరాపల్లి, పెద్దపాడు, ఎచ్చెర్లల్లో ఎంపిసి, బైపిసి, నందిగాంలో ఎంఇసి, సిఇసి గ్రూప్‌ల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. బాలురకు దుప్పలవలస, కొల్లివలస, కంచిలిల్లో ఎంపిసి, బైపిసి గ్రూప్‌లో ఖాళీగా ఉన్న మిగులు సీట్లకు ఈ నెల 4న ఎంపిక చేస్తారని తెలిపారు. బాలురకు దుప్పలవలస అంబేద్కర్ గురుకులంలోను 5న బాలికలకు ఎచ్చెర్ల అంబేద్కర్ గురుకులాల్లో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్ష రాసి సీటు రాని విద్యార్థినులు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌కు హాజరై అడ్మిషన్ పొందవచ్చన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కౌన్సెలింగ్‌నకు అర్హులు కారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, బడుగు బలహీన వర్గాలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించి వారికి అండగా నిలిచేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని సిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అమ్మఒడి పథకంపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారయ్యాయని అన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలిపారు. ఎంఇఒ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ మండలంలో 7126 మంది విద్యార్థులకు అమ్మఒడి అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, వైసిపి లీగల్‌సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, నాయకులు ఎన్ని అశోక్, రవి ప్రధాన్, కడియాల బాబూరావు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తం

పొందూరు: గ్రామాల్లో వ్యాప్తి చెందే జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ఎస్.మల్లేశ్వరమ్మ, శివశంకర్‌లు అన్నారు. మండలంలోని కింతలి పిహెచ్‌సి పరిధిలో డెంగీ జ్వరాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ దోమలు ద్వారా వ్యాప్తి చెందే విష జ్వరాల్లో డెంగీ ప్రమాదకరమైనదని అన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వాణీకుమారి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీషర్ పి.సురేష్‌కుమార్, ఎఎలు మోహనరావు, నర్సింహులు, పిహెచ్ఎన్ సూర్యకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కళలను పరిరక్షించుకుందాం

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

కళలను పరిరక్షించి వాటిని ముందుతరాలకు అందించే బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని, వాటి ఆదరణను మరింతగా పోషించేందుకు సాంస్కృతిక సమాఖ్య సంస్థలు కృషి చేయాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ షణ్ముగ బిందు ఫంక్షన్ హాల్‌లో జనజాగృతి సాహితీ సమాఖ్య సంస్థ 7వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ ప్రస్తుతం మానవ జీవితం ఉరుకులు, పరుగులతో సాగుతున్న తరుణంలో ఇటువంటి కళాప్రదర్శనలు ఒకే వేదికపై ప్రదర్శించి ఆహుతులను రంజింపజేయడం ఆనందదాయకమన్నారు. వాటిని సాంస్కృతిక సంస్థల ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కూజితప్రఖ్య బృందం ప్రదర్శించిన శివతాండవ, దుర్గమ్మల నృత్య ప్రదర్శన, కంచరాన హర్షిత రాగలాపన, ఈశ్వరాత్రో మిమిక్రీ, కొత్తపల్లి రమేష్ వెంట్రిలాక్విజం, బోయిన రమణమూర్తి క్రిష్ణరాయబారం, రాజారావు మాయల ఫకీరు కార్య క్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించగా, బద్రి కూర్మారావు రాసిన పిల్లలు రాసిన కళింగసీమ జానపద కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, కౌన్సిలర్ శార్వాణ గీత, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లబినాన వెంకటాచలం, తమ్మినాన మన్మథరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి, సభ్యులు శ్రీనివాసబాబీ, కాళీదాస్ పాల్గొన్నారు.


కళాకారుడిని సత్కరిస్తున్న చైర్మన్ గిరిబాబు

యాంత్రీకరణతో సాగు లాభదాయకం

ప్రజాశక్తి- జి.సిగడాం

ఆధునిక వ్యవసాయ విధానమైన యంత్రం సాయంతో ఎద సాగు పద్ధతి ఎన్నో విధాలు లాభదాయకంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని సంతవురిటిలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన చందనాల రామకృష్ణ, రంగారావులకు చెందిన 15 ఎకరాల పొలంలో శనివారం ఫెర్టికమ్ సీడ్డ్రిల్ యంత్రం ద్వారా వరి పొడి ఎద సాగు పద్ధతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధానంలో ఎకరాకు కేవలం 12 నుంచి 15 కేజీలు వరి విత్తనాలు సరిపోతాయని అన్నారు. అలాగే చీడపీడల భారీ నుంచి తప్పించుకోవచ్చని, తక్కువ నీటి ఖర్చుతో వర్షాధారంతో సమయానికి పంట సాగు చేయవచ్చునని తెలిపారు. పంట త్వరగా కోతకు వచ్చి తర్వాత రబీ పంట కూడా సమయం కలిసి వస్తుందన్నారు. దీని ఫలితంగా పంట కూడా అధిక దిగుబడిన సాధించవచ్చునని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వరి యాంత్రికరణ పద్ధతికి అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి, సమన్వయకర్త ఆకిరి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


యంత్ర సాయంతో ఎద సాగు చేస్తున్న రైతు


ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

మెప్మా బజార్‌తో ఆర్థికాభివృద్ధి

ఇచ్ఛాపురం : మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. కార్జీ వీధి కూడలి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాలు అభివృద్ధి సాధించాలన్నారు. మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బజార్‌లో మహిళా సంఘాలు తయారు చేసిన వివిధ రకాల ఫుడ్ ప్రోడక్టులు, చేతి తయారీ వస్తువులు అమ్మకాలకు పెట్టారు. 23వ వార్డులోని 31 శ్లామ్‌లో మహిళా సంఘాలు చేసిన వస్తువులను ఈ బజార్‌లో అమ్మకాలు చేస్తారని అన్నారు. వార్డు కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, జగన్, దిలీప్, నీలపు ఢిల్లీప్రకాశరావు, పట్నాయక్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


చింతాడ రవి

ఆమదాలవలస : సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విషప్రచారాలను తిప్పి కొట్టడానికి వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతులు, మహిళా సాధికారత తదితర రంగాల్లో జరిగిన అభివృద్ధిని విశ్లేషణాత్మకంగా వివరించాలన్నారు. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద అందిస్తున్నారని అన్నారు. సమావేశంలో చిగురుపల్లి రవికుమార్, కొప్పల ఈశ్వరరావు, అన్నెపుక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: వర్షాకాలం ఎక్కువగా వ్యాప్తి చెందే గొంతు, జబ్బవాపు వ్యాధికి ప్రభుత్వం ఉచిత అందిస్తున్న నివారణ టీకాలు తప్పనిసరిగా రైతులు పశువులకు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుడు రైతు భరోసా కేంద్రం పరిధిలో రామయ్యపేట తదితర గ్రామాల్లో ఉచితంగా గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలను 132 పశువులకు శనివారం వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు అనంతరావు, నారాయణరావు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ

పొందూరు: ప్రభుత్వం నిర్వేశించిన ఎఫ్‌సిఐ లక్ష్యాలను మిల్లర్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరణ ఆదేశించారు. మండలంలో పలు రైస్ మిల్లులను శనివారం తనిఖీ చేశారు. ఇప్పటికే జూన్ 30లోగా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని, ఆదేశాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఈయనతో డిటి వెంకటేష్, ఆర్ఐ రాధ, విఆర్ఒ రేవతీరావు ఉన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

పలాస: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం గతేడాది రూ.16 కోట్ల వ్యయంతో నాడు-నేడు పనులు చేపడుతున్నామని, పనులు వేగవంతం చేయాలని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నాడు-నేడు పనులపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు మొదటి విడత రూ.8 కోట్లతో 23 పాఠశాలలు, రెండో విడత రూ.16 కోట్ల వ్యయంతో 47 పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేసి పాఠశాలల్లో తరగతుల నిర్వహణకు అందించాలన్నారు. మొదటి దశలో ఇంకా ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే మరుగుదొడ్లు, బెంచీలు, తాగునీరు, వంటశాలలు అవసరమైతే వాటిని నాడు-నేడు ఫేజ్-2ఎ నిధులతో పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అందుకు ప్రతి పాఠశాలనూ సందర్శించి పాఠశాల అవసరాల వివరాలను తమ కార్యాలయానికి త్వరగా అందజేయాలని సూచించారు. సమావేశంలో నాడు-నేడు ఎఇ ఆర్.రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.


విందులో మిగిలిన భోజనాలను సేకరిస్తున్న సభ్యులు

ఆహారాన్ని వృథా చేయొద్దు

శ్రీకాకుళం అర్బన్ : పండగలు, పెళ్ళిళ్లు, ఇతర వేడుకల్లో బంధు, మిత్రులకు విందు సమయంలో మిగిలిన బోజనాలను అన్నార్తులకు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నిర్వహకులు అన్నాన్ని వృథా చేయకుండా తమకు సమాచారం అందించాలని న్యూబ్లడ్ బ్యాంకు మేనేజర్ టి.మణికంఠ తెలిపారు. ఎచ్చెర్ల మండలం కేశవురావుపేటలో శనివారం విందు కార్యక్రమంలో భోజనాలు మిగిలి ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న వెంటనే అక్కడికి చేరుకుని ప్రత్యేక వాహనంలోని పలు కూడళ్లల్లో పేదలకు పంచి పెట్టారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు 'మెతుకులే కదా, బయట పారేద్దాం' అన్న ఆలోచన కాకుండా నలుగురికి అన్నం పెడుతున్నామన్న భావనతో సమాచారాన్ని తెలియజేయాలన్నారు. నగరంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయని, వాటి ద్వారా పేదలకు సేవలందించేందుకు ఈ రకమైన తోడ్పాటు అవసరమని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళ బ్లడ్ బ్యాంకు సభ్యులు నంది ఉమాశంకర్, కె.శివ, జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ప్రెసిడెంట్ సిల్లా రమేష్, సభ్యులు పొడుగు చరణ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

విద్య, సంక్షేమ పథకాలపై సమీక్ష


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ రవి

జి.సిగడాం : జి.సిగడాం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో విద్యా సంక్షేమ పథకాలపై ఎంఇఒ అరసాడ రవి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యతతో కూడిన, ఉన్నతమైన విద్యను అందిస్తుందన్నారు. సిక్త్ స్టెప్ వెర్ఫికేషన్‌లో భాగంగా వెల్ఫేర్ లాగిన్‌ను పరిశీలించామన్నారు. జగనన్న గోరుముద్ద కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పకడ్బందీగా నాణ్యతతో అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జననన్న విద్యా కానుకల కిట్లు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో పిల్లల రికార్డులను పరిశీలించి డ్రాప్ అవుట్ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ భవ్యశ్రీకి సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సాహు, డిజిటల్ అసిస్టెంట్ రాము, ఎఎన్ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


దుస్తులతో క్రీడాకారులు

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన 20 మంది క్రీడాకారులకు రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. జిల్లా, మండల స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా దుస్తులను అందజేసినట్టు ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు బెందాళం చిట్టిబాబు, సభ్యులు ఆరింగి మధు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పులకల వెంకటరావు, జన్ని లోకనాథం, తెప్పల మోహనరావు, చందాన పాపారావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన బాలల సంక్షేమ సమితిలో చైర్‌పర్సన్లుగా, మెంబర్లుగా, జువెనైల్ జస్టిస్ బోర్డుల్లో సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలు అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలశాఖ, సంచాలకులు బి.వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిలాలో ప్రస్తుతం పనిచేస్తున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్హతలు, అనుభవం , ఎంపిక విధానం, ఇతర వివరాలకు http://wdcw.ap.gov.inవెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ కాలమ్ నుంచి పొందాలని సూచించారు.


పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన మద్దిల ధర్మారావు మాస్టర్ మాతృమూర్తి ఎరకమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శనివారం మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు పలాస మండల యాదవ సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, టిడిపి నాయకులు టి.గంగారాం, టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన ప్రభుత్వం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్న లక్ష్యంతో ప్రజలు టిడిపికి అండగా నిలుస్తున్నారని నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం నియోజకవర్గం లో ఎవరెన్ని విషపు ప్రచారం చేసినా ప్రజలు గుండ కుటు ఒబంపై విశ్వాసం కలిగి ఉన్నారన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ నాయకత్వాన పూర్వవైభవం సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

బూర్జ : టిడిపి పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు అనానరు. ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతోమాట్లాడారు. ఇటీవల నిర్వహించిన మినీ మహానాడులో తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర భవిష్యత్ గ్యారంటీ పేరుతో మినీ మేనిఫెస్టోను విడుదల చేశారని అన్నారు. ప్రజా సంక్షేమానికి చంద్రబాబు హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత పాలనలో వెనుకబడిన తరగతుల వారిపై జరుగుతున్న దాడులు తరుణంలో వాటిని నివారించేందుకు రక్షణ చట్టం అమలు చేసి అండగా టిడిపి నిలుస్తుందన్నారు. పేదరికం నిర్మూలించేందుకు మరిన్ని పథకాలు భవిష్యత్‌లో అమలు చేయనున్నారని తెలిపారు. ఈయనతో పాటు సోమినాయుడు ఉన్నారు.


మాట్లాడుతున్న ప్రసాదరావు